PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 133 | 28 శుక్రవారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



న్యూఢిల్లీ,ఆగస్ట్27 (ప్రజా సీమ)

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొన సాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిల పక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. ...మిగతా 2 లో...

## ఖేలో ఇండియా సంవాద్

- దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,ఆగస్ట్27 (ప్రజా సీమ) :



: దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్య క్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు.

...మిగతా 2 లో...



మన పత్రికలో పాఠకులకు
రిపోర్టర్లకు శ్రేయోభిలాషులకు
రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



## నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

- ఎపి వాసుల క్షేమంపై నారా లోకేశ్ సమీక్ష

అమరావతి,ఆగస్ట్27 (ప్రజా సీమ)

నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నేపాల్‌ల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల గురించి అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని..

...మిగతా 2 లో...

# పల్నాడు జిల్లాలో... ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు
- తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు



పల్నాడు,ఆగస్ట్27 (ప్రజా సీమ)

పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ...మిగతా 2 లో...



## రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

- మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు
- సిఆర్‌డిఎ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ

అమరావతి,ఆగస్ట్27(ప్రజా సీమ)

మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.

...మిగతా 2 లో...

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే
# ఈ దుస్థితి వచ్చేదా



- జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి
- గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

విశాఖపట్నం,ఆగస్ట్27(ప్రజా సీమ)

ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. ...మిగతా 2 లో...

## నేపాల్ వరదల్లో 300 మంది
# భారతీయుల గల్లంతు..!

- విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య
- సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్

ఖాట్మండ్,ఆగస్ట్27(ప్రజా సీమ)

నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్‌లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది.

...మిగతా 2 లో...





# నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు..!

మొదటిపేజీ తరువాయి

వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాఠ్మాండూకు పంపింది.

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా

మొదటిపేజీ తరువాయి

సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. గొడ్డలి పార్టీ అధినేత ప్రతి పది రోజులకు ఓ సారి ప్రెస్ మీట్ పెట్టి అబద్దాలను అలవోకగా చెప్పేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా అన్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చెప్పే అబద్దాలను ఎవరైనా నమ్ముతారేమోనని.. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే తాము ముందుకు వస్తున్నామని అచ్చెన్నాయుడు వివరించారు.

## పల్నాడు జిల్లాలో... ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷–రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

# ఖేలో ఇండియా సంవాద్

మొదటిపేజీ తరువాయి

భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## బాలికల సంరక్షణతోనే బంగారు భవిష్యత్తు

### రాఖీ వేడుకల్లో మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ

కమాన్ పూర్ (సుల్తానాబాద్) ఆగస్టు 27: (ప్రజా సీమ)

బాలికల రక్షణ, విద్య, సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం సుల్తానాబాద్‌లోని ఓల్డ్ ఏజ్ హోమ్, వికలాంగుల పాఠశాల, చిల్డ్రన్స్ హోమ్‌తో పాటు పలు సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దయా అరుణ మాట్లాడుతూ రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) అన్నది అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని తెలిపారు. రాఖీ కట్టడం ద్వారా కేవలం అన్నాచెల్లెళ్ల బంధాన్ని మాత్రమే కాకుండా, సమాజంలో మహిళలు, బాలికల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలనే సందేశాన్ని కూడా చాటవచ్చన్నారు. బాలికలను భారంగా కాకుండా బాధ్యతగా, భవిష్యత్తు తరాల నిర్మాణకర్తలుగా చూడాలని ఆమె సూచించారు. ప్రతి బాలికకు సమాన విద్యావకాశాలు కల్పించి, చిన్న వయసులో వివాహాలు జరగకుండా అడ్డుకోవడంతో పాటు, బాలికలపై హింస, వివక్ష, బాల కార్మికత్వం వంటి సమస్యలను నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**బాలికల విద్యకు ప్రభుత్వాల అండ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక సాధికారత కోసం అనేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని దయా అరుణ వివరించారు. బేటీ బచావో -- బేటీ పడావో ద్వారా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆద్వర్యం లో బాలికల పట్ల సమాజ దృక్పథంలో మార్పు తీసుకురావడంతో పాటు వారి విద్య, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. బాలికలు పాఠశాల విద్యను మధ్యలోనే నిలిపివేయకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉన్నత విద్య వరకు చదివించాలని సూచించారు. ఆడపిల్ల చదువుకుంటే ఒక కుటుంబం మాత్రమే కాకుండా మొత్తం సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే బాలికలు, మహిళలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, రక్షణ వ్యవస్థలు, మహిళా సాధికారత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బాలికలకు తమ హక్కులు, ప్రభుత్వ సహాయ పథకాల గురించి అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. "బాలికను కాపాడుదాం.. బాలికను చదివిద్దాం.. బాలిక ఎదుగుదలకు బాటలు వేద్దాం. విద్యతోనే బాలిక ఆత్మవిశ్వాసాన్ని పెంచి, స్వయం సమృద్ధి సాధించేలా చేయాలి" అని దయా అరుణ పిలుపునిచ్చారు. రాఖీ వేడుకల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టుకుని ఆనందాన్ని పంచుకున్నారు. పండుగ సందర్భంగా ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, సమానత్వం వంటి విలువలను పిల్లలకు వివరించారు. బాలికల సంరక్షణ, విద్య, భద్రతపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ ఆశ్రిత, కేడర్ ఎన్జీవో ఆఫీసర్ సతీష్, ఓల్డ్ ఏజ్ హోమ్ కోఆర్డినేటర్ నరేడ్ల స్వామితో పాటు సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు. బాలిక సురక్షితంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుంది.. బాలిక విద్యావంతురాలైతే సమాజం అభివృద్ధి చెందుతుంది.. బాలిక సాధికారత సాధిస్తే దేశ భవిష్యత్తు మరింత బలపడుతుంది అనే సందేశంతో రాఖీ వేడుకలు కొనసాగాయని జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ వివరించారు.



## రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

మొదటిపేజీ తరువాయి

ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణ మాఫీ వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్టిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## భూసమస్యలపై రెవెన్యూ సదస్సు దరఖాస్థులను త్వరగా పరిష్కరించాలి.

జయశంకర్ భూపాలపలి ఆగస్టు 27:(ప్రజా సీమ)

జిల్లాలో భూ దార్ కార్డుల జారీ కోసం చేపట్టిన రీ–సర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు, 22ఏ నిషిద్ధ భూముల పై అర్జీలు, భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31న రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం జరగనున్నందున అధికారులు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 70 గ్రామాల్లో రీ–సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పక్కాగా చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన కొలతలు నిర్వహించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ–సర్వేకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను అధికారులు పూర్తిగా అధ్యయనం చేసి అమలు చేయాలని తెలిపారు. అలాగే, 22ఏ నిషిద్ధ భూముల జాబితాలో నమోదైన ప్రభుత్వ, అటవీ, నీటిపారుదల, సింగరేణి తదితర భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన సవరణలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డుల సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, సబ్ రిజిస్ట్రార్ బాలకిషన్, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

మొదటిపేజీ తరువాయి

మరో ముగ్గురి ఆచూకీ లభ్యం కాలేదని మంత్రికి ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలియజేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మిల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.. కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా.. క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ సూచనలు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ప్రజాసీమ

# ఘనంగా ఎంపి అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

## - పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య భారీ కేక్ కటింగ్

**వేంపల్లె ప్రజాసీమ:**

కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్సిపి శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో శ్రేణులు, అభిమానుల మధ్య భారీ కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టిన రోజును పురస్కరించుకుని పలుచోట్ల అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యుడు ఎం.రవికుమార్ రెడ్డి, వైసిపి కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటిక చంద్ర, రైతు విభాగం నేత మస్తాన్ రెడ్డి, నాయకులు కొండయ్య, హబిబుల్లా, కమతం రాజా, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎంపి అవినాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

## - వైఎస్ఆర్సీపి మండల ఉపాధ్యక్షుడు కె.రవిశంకర్ గౌడ్

**వేంపల్లె ప్రజాసీమ:**

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కి వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షుడు కె. రవిశంకర్ గౌడ్ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఎంపి పుట్టిన రోజు సందర్భంగా నిండు నూరేండ్లు సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కడప పార్లమెంటు పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎంపి సేవలను కొనియాడారు



# పేద విద్యార్థులకు పిఎం విద్యా లక్ష్మి యోజన వరం

## - బిజెపి నేత గాలి హరిప్రసాద్

**వేంపల్లె ప్రజాసీమ:**

పేద విద్యార్థులకు పిఎం విద్యా లక్ష్మి యోజన పథకం ఒక వరం అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభావంతులైన విధ్యార్థులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం విద్యా లక్ష్మి యోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆ పథకం కింద గుర్తింపు పొందిన ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన విధ్యార్థులకు బ్యాంక్ ల ద్వారా రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట అర్హతల ప్రకారం వడ్డీ రాయితీ కల్పిస్తోందన్నారు. ఉన్నత విద్యను అందించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం, దార్శనిక నాయకత్వానికి నిదర్శనమన్నారు. దేశ అభివృద్ధికి విద్యే ప్రామాణిక లక్ష్యంతో ప్రధాని మోడీ విప్లవాత్మక సంక్షేమ పథకాలు అమలు చేయడం గర్వణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పలత, రవి యాదవ్, మాధవ తదితరులు పాల్గొన్నారు.




# రాజంపేట లో హిందువుల నిరసన

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేటలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన ఘటన పై పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కుటుంబం ఆత్మహత్యకు కారకుడైన సాదిక్ ను వెంటనే ఉరితీయాలని నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూ మహిళల రక్షణతో పాటు మత మార్పిడుల పేరుతో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న వేధింపులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నాయకులు పేర్కొన్నారు. మహిళలు, కుటుంబాల భద్రతకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.




# క్యూఆర్ కోడ్ స్కానింగ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

## - జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘంచే నిరసన - హాజరైన అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎస్.మౌలాలి





**మదనపల్లె (ప్రజా సీమ) :**

సెప్టెంబర్ నెల నుంచి రేషన్ కార్డు దారులకు పంపిణీ చేసే 10 శాతం బ్రోకెన్ బియ్యం బస్తాలపై నూతనంగా క్యూఆర్ కోడ్లను స్కానింగ్ చేయాలానే నిబంధన రేషన్ డీలర్లకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మౌలాలి స్పష్టం చేశారు.దీనిపై జిల్లా కేంద్రం మదనపల్లెలో అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి జాయింట్ కలెక్టరుకు ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మౌలాలి మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్ మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి దిగుమతి అయ్యే ప్రతి బస్తాను రేషన్ షాపులో దిగుమతి చేసుకున్న సమయంలో స్కాన్ చేస్తూ షాప్ స్టాక్ నిల్వలలో నమోదు చేయవలిసి రావడం,పంపిణి సమయంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ పోస్ నందు నమోదు చేస్తూ పంపిణీ చేయాల్సి చేయాల్సి ఉండటం వలన అనేక సాంకేతిక సమస్యలతో పాటు డీలర్లకు పనిభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా రేషన్ డీలర్లలో చాలామందికి ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులో లేకపోవడం, మహిళలు, వయోవృద్ధులు,వికలాంగులు,డీలర్లుగా ఉన్నారని ఇది వారికి కష్టసాధ్యమని పేర్కొన్నారు.ప్రతినెల అనధికారికంగా ప్రతి రేషన్ డీలర్లు తమకు ఉన్న అలాట్మెంట్లు బట్టి వంద కేజీల నుంచి 300 కేజీల వరకు మండల స్టాక్ లెవల్ పాయింట్లో జరుగుతున్న అవకతవకల వల్ల నష్ట పోతున్నారని,ఈ సమస్యను పరిష్కరించకపోగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం వల్ల మండలం లెవల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న తప్పులకు తమను బాధ్యులుగా చేయడం తీవ్ర మనో వేదనకు గురిచేస్తుందని పేర్కొన్నారు.కావున నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని పునఃసమీక్షించి ఉప సంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయప్రకాష్,కోశాధికారి చంద్రశేఖర్,వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అంజాద్ అలీ మరియు జిల్లావ్యాప్తంగా ఉన్న డీలర్లు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేక చొరవ

## - టెలికాం అడ్వైజరీ సెంట్రల్ కమిటీ మెంబర్ ఎస్.ఏ కరీముల్లా ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి చొరవతో గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని టెలికాం అడ్వైజరీ సెంట్రల్ కమిటీ మెంబర్ ఎస్.ఏ కరీముల్లా హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన టెలికాం అడ్వైజరీ సెంట్రల్ కమిటీ సమావేశాలలో రాజంపేట ఎంపి మదనపల్లె డివిజన్ పరిధిలోని తంబళ్ల పల్లి మరియు పీలేరు నియోజకవర్గాలలో పలు గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ సేవలను అందు బాటులోకి తీసుకు రావాలని ప్రతి పాదనలు పంపినట్లు తెలిపారు.ఈ ప్రతిపాదనలు బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు,పరిశీలన లో ఉన్నాయని, త్వరలోనే వాటికి అనుమతులు వస్తాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ముఖ్యంగా పెద్దమండ్యం మండలంలో బండమీదపల్లి,దిగుపల్లి గ్రామాలలో త్వరలోనే టవర్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. అలాగే పెద్దమండ్యం మండలంలో




గుడిసెవారిపల్లె,పాపేపల్లి,కోటకాడపల్లి,గుర్రంవాండ్లపల్లి కలిచెర్ల, సిద్దవరం, చింతమాకులపల్లి గుర్రంకొండ మండలం లో ఎల్లుట్ల గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలను అందుబాటు లోకి తీసుకువచ్చే విధంగా టవర్ల ఏర్పాటుకు ఎంపీ మిథున్ రెడ్డి ప్రతిపాదనలు పంపడం జరిగిందని పేర్కొంటూ హర్షం వ్యక్తం చేశారు.మరోవైపు పెద్దమండ్యం మండలం లో ఇప్పటివరకుఅందుబాటులో వున్న బిఎస్ ఎన్ఎల్ 2జి స్థానంలో వినియోగ దారులకు 4జి సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఇందులో ఎంపీ చొరవ అభినందనీయమని కితాబు నిచ్చారు. అదే క్రమంలో మదనపల్లె పట్టణంలో ఈశ్వరమ్మ కాలనీ,శేష మహల్ ఏరియా,కొత్తిండ్లు ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకువచ్చే విధంగా ఎంపీ చొరవతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని,త్వరలోనే ఇది కార్యరూపం దాల్చే విధంగా అధికారులు చర్యలు తీసుకొనున్నట్టు ఎస్.ఏ కరిముల్లా వెల్లడించారు.

# విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం..

## పచ్చదనం కోసం పోలీసుల వినూత్న కార్యక్రమం

**పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:**

తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకుప్రాధాన్యతనిస్తూ పుల్లంపేట ఎస్‌బీవీడీఎస్ హైస్కూల్‌లో గురువారం ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టి పాఠశాల ప్రాంగణంలో 250 మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, పుల్లంపేట ఎస్ఐ చిన్న రెడ్డప్ప, పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ, కరస్పాండెంట్ శ్రీరాములు పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతి మొక్కను సంరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చెట్లు మానవాళికిప్రాణవాయువును అందించేఅమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు."నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందిస్తాయి" అని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సందేశాన్ని గుర్తుచేస్తూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దాని బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలలో వెలుగులు

## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా వెల్లడి

## - మదనపల్లిలో విస్తృతంగా ఇంటింటికి తెలుగుదేశం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మున్సిపాలిటీ పరిధిలో 18,21,22 వార్డులలో గురువారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్ల కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ఎమ్మెల్యే యం.షాజహాన్ బాషా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని,తాము ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో వార్డులో పర్యటిస్తుంటే ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని,కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని,సూపర్ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా జేజేలు పలుకుతున్నారన్నారు.స్థానికంగా నెలకొన్న పలు సమస్యలు నా దృష్టికి వచ్చాయని,తక్షణమే అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గంగారపు రామ్మూర్తి నాయుడు,గౌస్ అజాం,ఇంతియాజ్,దాదు పెద్దఎత్తున తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# గొల్లప్రోలులో నాసిరకం డ్రైన్ పనులు

# -ప్రజల తీవ్ర ఆగ్రహం









### -22 శాతం తక్కువకు టెండర్ దక్కించుకుని ఇష్టారాజ్యం

### కోటి 30 లక్షల పనుల్లో భారీ అవినీతి ఆరోపణలు పట్టించుకోని అధికారులు

### -క్వాలిటీ కంట్రోల్ తనిఖీలకు స్థానికుల డిమాండ్

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు పట్టణ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న డ్రైన్ నిర్మాణ పనులు అత్యంత నాసిరకంగా సాగుతుండడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి క్వాలిటీ లేకుండా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పర్యవేక్షించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పట్టణ పరిధి పలు వీధుల్లో డ్రైన్ల నిర్మాణానికి 3 మాట్ల రూపాయలకు పైగా నిధులతో పనులు మంజూరయ్యాయి.ఈ పనుల్లో కోటి 30 లక్షల వరకు సదరు కాంట్రాక్టర్ ఏకంగా 22 శాతం తక్కువ ధరకు (లెస్ టెండర్) ఈ పనులను దక్కించుకున్నాడు. తక్కువకు టెండర్ వేసిన కాంట్రాక్టర్ ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి పనుల్లో నాణ్యతను పూర్తిగా గాలికొదిలేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.నిర్మాణంలో నిల్వ ఉంచిన సిమెంట్,నాణ్యత లేని మెటల్‌ను విచ్చలవిడిగా వాడుతున్నట్లు పలువురు తెలిపారు.ఇసుకను అధికంగా ఉపయోగిస్తూ సిమెంటును మొక్కుబడిగా కలుపుతూ రూపాయి పనికి పావలా వంతు కూడా ఖర్చు చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో చేస్తున్న ఈ పనులకు కనీసం 40 లక్షల రూపాయలు కూడా ఖర్చు కావడం లేదని అంచనా వేస్తున్నారు.

**పాత అవినీతిపైనే చర్చ:**

సదరు కాంట్రాక్టర్‌కు గతంలోనూ అవినీతి చరిత్ర ఉందని పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతంలో గొల్లప్రోలు పట్టణ పరిధిలోనే ఎలాంటి పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించి రూ.3.6 కోట్లు ప్రభుత్వ సొమ్ము కాజేశాడనే బలమైన ఆరోపణలు ఉన్నాయి.ఇప్పుడు మళ్లీ అదే తరహాలో దోపిడీకి తెర లేపాడని స్థానికులు వాపోతున్నారు.తన అవినీతి బయటపడకుండా ఉండేందుకు డ్రైన్ పనులు జరిగే చోట ప్రజల మధ్య కాంట్రాక్టర్ కావాలనే వివాదాలు సృష్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నట్లు సమాచారం.

**అధికారులు చర్యలు చేపట్టాలి**

అవినీతి కాంట్రాక్టర్ ఆగడాలకు వెంటనే అడ్డుకట్ట వేయాలని గొల్లప్రోలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.క్వాలిటీ కంట్రోల్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ప్రస్తుతం పట్నంలో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు. నాసిరకం మెటీరియల్ పై పరీక్షలు జరిపి బాధ్యులైన కాంట్రాక్టర్ అతనికి సహకరిస్తున్న అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఆదిత్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.ప్రవీణకు పీ.హెచ్.డి

### - అభినందనలు తెలిపిన కళాశాల యజమాన్యం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మదనపల్లెలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం అసిస్టెంట్ ప్రొఫెసరుగా విధులు నిర్వహిస్తున్న జె.ప్రవీణకు వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) విశ్వవిద్యాలయం నుంచి పీ.హెచ్.డీ పట్టా అందుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకురాలు ప్రతిష్టాత్మక విట్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమన్నారు.ఆప్టిమల్ డిమాండ్ సైడ్ మేనేజ్మెంట్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెంట్ బిల్డింగ్స్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టర్ ప్రవీణ డాక్టరేట్ పొందారని ఆయన తెలిపారు.ప్రొఫెసర్ ఐ.జాకబ్ రాగ్లెండ్ మార్గదర్శకత్వంలో ఆమె పరిశోధన సాగిందన్నారు.ప్రస్తుతం విద్యుత్ వినియోగం,డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భవనాల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, విద్యుత్ వ్యయాన్ని తగ్గించడం,గరిష్ఠ డిమాండుని నియంత్రించడం, పునరుత్పాదక ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై డాక్టర్ ప్రవీణ పరిశోధన చేసినట్లు వివరించారు.డాక్టర్ ప్రవీణ సాధించిన ఈ పీ.హెచ్.డితో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల గౌరవం మరింత పెరిగిందని వెల్లడించారు.ఆమె పరిశోధన భవిష్యత్తులో శక్తి సామర్థ్యంతో కూడిన స్మార్ట్ భవనాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పీహెచ్ సాధించిన డాక్టర్ జె.ప్రవీణను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్,ఈఈఈ విభాగాధిపతి,అధ్యాపకులు,సిబ్బంది అభినందించినట్లు డైరెక్టర్ తెలిపారు.అధ్యాపకులు బోధనతోపాటు పరిశోధన రంగంలో కూడా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.




## ప్రజాసమస్యల పరిష్కారంలో మీడియా చొరవ అభినందనీయం

### - ఏ.పీ.ఎస్.యు.ఎఫ్ వ్యవస్థాపకులు ప్రణయ్ ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ప్రజాసమస్యల పరిష్కారంలో మీడియా చొరవ అభినందనీయమని ఏ.పీ.ఎస్.యు.ఎఫ్ వ్యవస్థాపకులు ప్రణయ్ ప్రశంసించారు.ఇటీవల పట్టణంలోని శీనా టీస్టాల్ ఎదురుగా ప్రారంభమైన మదనపల్లె ప్రెస్ క్లబ్ ని గురువారం తన బృందంతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో పాతికేయలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని,ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వ్యవహరిస్తున్నారని ప్రశంసించారు.ప్రజాస్వామ్యంలో పాత్రికేయ వృత్తి ఎంతో ఉన్నతమైందని,వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు.తమ సంస్థతోపాటు ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని కొనియాడారు.సమాజ శ్రేయస్సు కోసం పరితపించే పాత్రకేయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయడంతోపాటు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. మదనపల్లి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమవంతు సహాయ,సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.ఇందులో భాగంగా ప్రణయ్ ని మదనపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఎస్.యు.ఎఫ్ సభ్యులు జయవర్ధన్ రెడ్డి,బాషా,సుధీర్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, మహిళల భద్రతపై అవగాహన

**రాజంపేట (ప్రజా సీమ):**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు రాజంపేట టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం రాజంపేట పాత బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అలాగే రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మహిళలు మరియు బాలికలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని ఎస్.ఐ. ప్రజలకు సూచించారు. ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.





## రాఖీ పౌర్ణమికి 198 మంది ఆడపడుచులకు పట్టు చీరల బహుకరణ

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ ) గొల్లప్రోలు:**

రాఖీ పౌర్ణమి సందర్భంగా గొల్లప్రోలు పట్టణంలో వితంతు పింఛన్లు పొందుతున్న 20 నుంచి 45 సంవత్సరాల లోపు గల 198 మంది ఆడపడుచులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున పట్టు చీరలను బహుకరించనున్నారు. వారిని అక్కాచెల్లెళ్లుగా భావిస్తూ రాఖీ పౌర్ణమి కానుకగా ఈ చీరలను అందజేస్తున్నారు.ఈ మేరకు 198 పట్టు చీరలు గొల్లప్రోలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి చీరలను పరిశీలించి, శుక్రవారం ఉదయం లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేసేలా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి లబ్ధిదారురాలికి చీర అందేలా తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో కడారి తమ్మయ్య నాయుడు, బలిరెడ్డి గంగబాబు, కోసిరెడ్డి సూరిబాబు, మేనేజర్ సర్వేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.డి. అలీషా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## వితంతు ఆడపడుచులకు రాఖీ పండుగ కానుకగా చీరలు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )పిఠాపురం:**

రాఖీ పండుగను పురస్కరించుకుని పిఠాపురం నియోజకవర్గంలోని వితంతు ఆడపడుచులకు రాఖీ పండుగ కానుకగా చీరలు అందజేయనున్నట్లు జనసేన నాయకులు తెలిపారు.జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం (28-08-2026) నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలోని జనసేన కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులకు అండగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కులగణన సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలి

### - తహసీల్దార్ కి వినతిపత్రం

**వేంపల్లె ప్రజాసీమ:**

కులాల జాబితాను, కుల గణన సర్వేలను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ దృక్పథంతో నిర్వహించాలని ఎంపిటిసి సభ్యులు కటిక చంద్రశేఖర్, హబిబుల్లా(ఎంహెచ్), భారతీ లు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ శివశంకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కుల గణన సర్వేలో ఉపయోగించే ప్రశ్నావళిని స్పష్టంగా, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సవరించాలని కోరారు. కులాల వర్గీకరణ, గణనలో స్పష్టమైన పద్ధతులు అవలంబించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత ఎంపిటిసి ఎన్నికల్లో అధికారుల అవగాహన లోపం కారణంగా రాజీవ్ నగర్ కాలనీకి చెందిన దాదాపు 2 వేల ఓట్లు.. క్రమసంఖ్య ప్రకారం ఒకేచోట లేకుండా వివిధ వార్డుల్లో పడ్డాయన్నారు. ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అలా కాకుండా ఓటర్లందరిని క్రమసంఖ్య ప్రకారం ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపిటిసిలు తహసీల్దార్, ఎంపిడిఓ లను కోరారు.



ప్రజాసీమ

# చమర్తి ఆన్ డ్యూటీ

## -మేజర్ కెనాల్ పూడికతీత పనులు ప్రారంభం

## -స్వయంగా పర్యవేక్షించిన చమర్తి జగన్ మోహన్ రాజు

## -హర్షం వ్యక్తం చేసిన ప్రజలు





**రాజంపేట,ప్రజా సీమ:**

రాజంపేట పట్టణ ప్రజలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఒకటైన మేజర్ కెనాల్ (ప్రధాన కాలువ) పూడికతీత మరియు శుభ్రపరిచే కార్యక్రమాన్ని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గురువారం ఉదయం స్వయంగా ప్రారంభించారు. ఉదయం 7:00 గంటలకే రంగంలోకి దిగిన చమర్తి జగన్ మోహన్ రాజు, హైవే పెట్రోల్ బంక్ నుంచి చక్రాలు మడుగు వరకు గల మేజర్ కెనాల్ క్లీనింగ్ పనులను జేసీబీ యంత్రాల సహాయంతో ప్రారంభించి, దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. మురుగునీరు సజావుగా సాగిపోయేలా చేయడం, పిచ్చిమొక్కలు మరియు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పట్టణంలో ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టారు.

**పట్టణ ప్రజల హర్షం**

ఎంతో కాలంగా కాలువలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ చర్యతో ఉపశమనం లభించనుంది. ప్రజా సమస్య పరిష్కారానికి నేరుగా రంగంలోకి దిగి పనులను ప్రారంభించిన నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు చొరవపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

### - ఇంచార్జీ ఏఇ మైకల్ జాక్సన్

**వేంపల్లె ప్రజాసీమ:**

ఆయా ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత ఉండనున్నట్లు ఇంచార్జీ ఏఇ మైకల్ జాక్సన్ వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ ఫీడర్ పరిధిలో మరమ్మత్తుల పనుల నేపథ్యంలో కడప రోడ్డు, ఎస్సీ కాలనీ, కాపువీధి, పాతపేట, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, బ్యాంక్ సర్కిల్, శ్రీచైతన్య స్కూల్, టిటిడి కళ్యాణ మండపం, ఉషాకిరణ్ స్కూల్, ప్రియాతోట, బూడిదగుంట, గౌరిదేవి ఆలయం, పాతపేట, అమ్మవారిశాల వీధి, బొడ్డుచావిడి, బిడాలమిట్టా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గొల్లప్రోలు లో ఘనంగా మాదేపల్లి రంగబాబు 11వ వర్ధంతి

### -రంగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు దివంగత తెలుగుదేశం పార్టీ నేత, పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదేపల్లి రంగబాబు 11వ వర్ధంతి వేడుకలను గురువారం గొల్లప్రోలులో ఘనంగా నిర్వహించారు. టీడీపి పట్టణ అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు స్థానిక మెయిన్ రోడ్డుపై ఉన్న రంగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుండ్ర సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి రంగబాబు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు.పార్టీ శ్రేణులంతా ఆయన స్ఫూర్తిని, ఆదర్శాలను తీసుకొని ముందుకు సాగాలన్నారు.ప్రతి నాయకుడు,కార్యకర్త రంగబాబు అడుగుజాడల్లో నడిచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అంతకు ముందు రంగబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు,టీడీపి నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు జోహార్ రంగబాబు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో రంగబాబు తనయుడు మాదేపల్లి వినీల్ వర్మ,మాజీ మున్సిపల్ చైర్మన్ శీరం మాణిక్యం,టీడీపి నాయకులు కడారి శివన్నారాయణ (బాబ్జి),బస సత్యనారాయణ,దువ్వా తాతాజీ, ఏలేరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఇంధన శ్రీను,మాజీ కౌన్సిలర్ గుళ్ల సుబ్బయ్య,పర్వత కొండయ్య,చేతులూరి మాణిక్యం,బలిరెడ్డి నాని,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రారంభమైన జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు

**గొల్లప్రోలు కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలను వెలికితీసి నేటి సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు మండల వ్యాప్తంగా గురువారం ప్రారంభమయ్యాయి. గొల్లప్రోలు మండల,పట్టణ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌కు ఉత్సాహంగా హాజరయ్యారు.స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మాధురి విద్యాలయాల్లో జరుగుతున్న పరీక్షలను జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా చెకుముకి మండల కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ సంబరాల ముఖ్య ఉద్దేశమన్నారు.మండల వ్యాప్తంగా మొత్తం 19 పాఠశాలల నుండి సుమారు 19 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ప్రతిభావంతులు తదుపరి మండల స్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం,అధ్యక్షులు ఏలేటి నానిబాబు,యూత్ కన్వీనర్ టి. వీరమణి పలు పాఠశాలల ఉపాధ్యాయులు,జెవివి ప్రతినిధులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా నూతన షిఫా వి.కేర్ ఐవీఎఫ్ ఆసుపత్రి ప్రారంభం

### - హాజరైన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్,కృష్ణ నగర్‌లో నూతనంగా నిర్మించిన షిఫా వి.కేర్ ఐవీఎఫ్ సెంటర్,ఫర్టిలిటీ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి గురువారం అటహాసంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు హాజరయ్యారు.ముందుగా ఆసుపత్రి వైద్యులు శ్రీరామ్ చినబాబుకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నూతన ఆసుపత్రిని డాక్టర్ కలీల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఆధునిక వైద్య సేవలు,నాణ్యమైన చికిత్సలు ప్రజలకు అందుబాటులోకి రావడం మదనపల్లె ప్రాంతానికి ఎంతో ఉపయోగకరమన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యాలగిరి దొరస్వామి నాయుడు,తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్,చందు బీజేపీ యువ నాయకులు బండి దామోదర్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






## మదనపల్లెలో పర్యటించిన సర్ స్పెషల్ అబ్జర్వర్

### - మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లాలో అమలవుతున్న సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం మదనపల్లెకు విచ్చేసిన స్పెషల్ అబ్జర్వర్,సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబుని,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మర్యాదపూర్వకంగా కలిశారు.స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ అబ్జర్వర్‌కు ఎస్పీ పూలమొక్కను బహూకరించి సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం జిల్లాలో జరుగుతున్న సర్ ప్రక్రియ అమలుపై అధికారులు కొద్దిసేపు చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పాల్గొన్నారు.



## నిశ్చితార్థ వేడుకకు హాజరైన శ్రీరామ్ చినబాబు

### - నూతన వధూవరులకు ఆశీర్వాదం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని స్థానిక మాంగళ్య ఫంక్షన్ హాల్ నందు గురువారం పుంగనూరు నియోజకవర్గం,చౌడేపల్లి మండలానికి చెందిన విజయవాణి ప్రింటర్స్ అధినేత మహేష్ కుమార్తె నిశ్చితార్థ వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ శుభకార్యానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యాలగిరి దొరస్వామి నాయుడు,తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్,చందు,బీజేపీ యువ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పీలేరులో వైద్యం వికటించి రైతు మృతి.. సమగ్ర విచారణకు సీపీఎం డిమాండ్

## -'ఠాగూర్' తరహాలో వైద్య వ్యవహారం జరిగిందా?-ఎస్‌కేఆర్ ఆసుపత్రి తీరుపై కుటుంబ సభ్యుల తీవ్ర ఆరోపణలు

పీలేరు ప్రజాసీమ:



అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలం జాండ్రపేట గ్రామానికి చెందిన కె. సురేంద్ర (42) వైద్యం కోసం పీలేరులోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిని ఆశ్రయించి మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించగా, ఈ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సురేంద్రకు కిడ్నీలో రాళ్లు ఉండటంతో నొప్పులు వస్తున్నాయని బుధవారం పీలేరులోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం గురు వారం ఆసుపత్రిలో చేర్చుకుని, కిడ్నీలోని రాళ్లు తొలగించేందుకు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పి సుమారు రూ.35 వేల వరకు తీసుకున్నారని బంధువులు ఆరో పించారు. ఆపరేషన్‌కు ముందు మత్తు మందు ఇచ్చే సమయంలో సురేంద్ర ఆరోగ్య పరిస్థితి ఒక్క సారిగా విషమించిందని, అనంతరం ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే విషయాన్ని వెంటనే తమకు తెలియజేయకుండా అత్యవసర చికిత్స అవసర మంటూ పీలేరు నుంచి తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు.సురేంద్ర అప్పటికే మృతి చెందినప్పటికీ అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందిస్తున్నట్లు చూపిస్తూ స్విమ్స్‌కు తీసుకువచ్చారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఉదయం 9 గంటల సమయంలో స్విమ్స్ క్యాజువాల్టీకి చేరుకున్న అనంతరం అక్కడి వైద్యులు పరీక్షించి పల్స్ లేదని, అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భార్య, పిల్లలు, బంధువుల రోదనలతో స్విమ్స్ ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న సీపీఎం నాయకులు కందారపు మురళి, టి. సుబ్రహ్మణ్యం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.సురేంద్ర మృతికి దారితీసిన పరిస్థితులు, ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షలు, మత్తు మందు ఇచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, స్విమ్స్‌కు తరలించే సమయానికి ఆయన ఆరోగ్య పరిస్థితి, అంబులెన్స్‌లో అందించిన అత్యవసర వైద్యం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వైద్య నిర్లక్ష్యం లేదా ఇతర తప్పిదాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయడంతో పాటు తగిన ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

# ఇన్ సర్వీస్ టీచర్లను ఆందోళనకు గురిచేయడం సబబు కాదు

## - ఎస్.టి.యు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి,మధుసూదన్ డిమాండ్

మదనపల్లె (ప్రజా సీమ) :

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదన గురి చేస్తున్న టెట్ నుంచి మినహాయింపు చేసే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నో ప్రాతినిధ్యాలు చేసిన పార్లమెంటులో చట్టసవరణ చేయకపోవడం చాలా దారుణమని వెంటనే చట్టసవరణ చేయాలని ఎస్.టి.యు.జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి,పోకల మధుసూదన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర సంఘ పిలుపు మేరకు నేటి సాయంత్రం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయులలో ఆందోళనకు కారణమైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించాలని,అందు కొరకు వెంటనే విద్యాహక్కు చట్టంలో 23(1) నిబంధనను సవరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.అందుకొరకు వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.ఇటీవల నిర్వహించిన టెట్ నందు చాలామంది సీనియర్ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు ఆన్ లైన్ విధానంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడం జరిగిందన్నారు.అదేవిధంగా నిన్న ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ టెట్ నందు ఎలాంటి మార్పులు చేయకుండా నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులకు కామన్ గా 40 శాతం ఉత్తీర్ణత శాతంగా నిర్ధారించి ఆఫ్ లైనులో పరీక్ష నిర్వహించాలని,బోధించు సబ్జెక్టు వరకే సిలబస్ పరిమితం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో కడియాల మురళి,అయూబ్,రాజారెడ్డి,నరసింహులు,శ్రీనాథ్,శ్రీనివాసులు,రమాదేవి,కుసుమ,సైరా భాను,సుశీల, అశోక్,రెడ్డప్ప రెడ్డి,సుబ్బారెడ్డి,అమరనాథ్ రెడ్డి,మోహన్, హరీష్,సుకూర్, నరసింహారెడ్డి, శేఖర్ రెడ్డి, గోపాల్, నాగమోహన్ రెడ్డి,శివకుమార్,రవీంద్రనాథ్ రెడ్డి, సుధాకర్, అక్బర్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.






# విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

## ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్

### ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పీలేరు ప్రజాసీమ:

పీలేరు మండల పరిధిలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించా రంటూ తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు ఆందో ళన కలిగిస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు పేర్కొన్నారు. చిన్నారుల భద్రతకు సంబం ధించిన అంశం కావడంతో అధికారులు ఈ ఘటనపై అత్యంత సున్నితంగా వ్యవహరించి సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల ఆరోపణల ప్రకారం ఒకటో తరగతికి చెందిన ఇద్దరు, నాలుగో తరగతికి చెందిన మరో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అస భ్యంగా ప్రవర్తించారనే విషయం అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీంతో సంబంధిత అధికారులు పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది.



ఈ ఘటనపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పాలకుంట శ్రీనివాసులు కోరారు. విచారణ పూర్తికాకముందే ఎలాంటి ముందస్తు నిర్ధారణలకు రావడం సరికాదని, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను అధికారిక విచారణలోనే నిర్ధారించాలని స్పష్టం చేశారు. అయితే విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఉపాధ్యాయుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల గౌరవం, భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా విద్యాశాఖ అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

## - 32వ వార్డు టిడిపి అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి స్పష్టం

మదనపల్లె (ప్రజా సీమ) :

పట్టణంలోని రెడ్డీస్ కాలనీ,యోగివేమన నగర్‌లో చర్చి వద్ద పాడైపోయిన బ్రిడ్జి కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వార్డువాసుల సమస్యను 32వ వార్డు అధ్యక్షులు మండిపల్లి (జెసిబి) మధుసూదన్ రెడ్డి గుర్తించారు.వెంటనే స్పందించి గురువారం తన సొంత నిధులతో బ్రిడ్జికి మరమ్మతులు చేయించి ప్రజలకు రాకపోకలు సుల భతరం చేశారు.ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.వార్డులో నెలకొని ఉన్న సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నామని,సంక్షేమ పథకాలను అర్హులం దరికీ అదేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిం చామని తెలిపారు. అదేవిధంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.సొంత నిధులతో బ్రిడ్జి మరమ్మతులు చేపట్టిన మధుసూదన్ రెడ్డి సేవా దృక్పథాన్ని వార్డు ప్రజలు అభినందించారు.





# హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడిపై అంతులేని అభిమానం

## - ముందస్తుగా రక్తదానం చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు

మదనపల్లె (ప్రజా సీమ) :

హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ పుట్టినరోజుని పురస్కరించుకొని హెల్పింగ్ మైండ్స్ సభ్యుడు బషీర్ ముందస్తుగా రక్తదానం చేసి శుభాకాంక్షలు తెలియజేసిన,మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంకులో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ ఆగస్ట్ 28 తన పుట్టినరోజని సేవా కార్యక్రమాల నడుమ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉదయం ప్రార్థన మందిరాలు అయినా మస్జీద్,గుడి,చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈద్గా ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం,బెంగళూరు రోడ్డు గోశాలలో గోవులకు గోగ్రాసం,చైతన్య ఆశ్రమ చిన్నారులకు అన్నదానం,జడ్పీ హైస్కూల్ ఎదురుగా రక్తదాన శిబిరంతోపాటు ఉచిత రక్త వర్గీకరణ కార్యక్రమం,హెల్పింగ్ మైండ్స్ ప్యాకెట్ బ్యాడ్జెస్ ఆవిష్కరణ,మరణానంతరం అవయవ దాన ఆవశ్యకత పోస్టర్ల ఆవిష్కరణ,అన్నదానం,అన్నార్తుల ఆకలి తీర్చడానికి ఫుడ్ బ్యాంకులో ఆహారం,కూరపర్తి ఆశ్రమ చిన్నారులకు స్నాక్స్ పంపిణీ,ముదివేడు అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్,మూగజీవాలకు అరటి పండ్లు,మొక్క జొన్నలు పంపిణీ,మస్తాన్ వలి దర్గాలో చాదర్ సమర్పణ ఇలా సేవా కార్యక్రమాలు ఉండబోతున్నట్లు తెలిపారు.





# ఘనంగా ఎంపి అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

## - పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

## - కేక్ కట్ చేసి సంబరాలు

వేంపల్లె ప్రజాసీమ:

మండలంలోని ఇడుపులపాయ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వీరన్నగట్టుపల్లి గ్రామంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్సిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం వైఎస్ఆర్సిపి యువనేత, గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం పాలక మండలి మాజీ ఛైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. వీరన్నగట్టుపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. తమ అభిమాన నేత జన్మదిన వేడుకలను పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వహించడం సంతోషంగా ఉందని, ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరినాథ్, దర్బార్, మల్లయ్య, అజీం, శ్రావణ్, పుల్లయ్య, గంగరాజు, చుక్కయ్య, పీరా, శేఖర్, చాను, సుధాకర్, సావిత్రి, కుళాయప్ప, శ్రీరాములు, జయరాములు, హనుమంతు, ఖాదర్ వలి, రామసుబ్బయ్య, చిన్నరెడ్డయ్య, బాషా, మున్నా, సురేంద్ర, గౌస్, కరీం, మహామ్మద్, ఫిర్దోస్, అర్షద్, గంగయ్య, ఆంజనేయులు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# ఉత్సాహంగా ఖేలో ఇండియా ఖేల్ కీ బాత్ విత్ పీఎం మోదీ

## - క్రీడలతో క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,జట్టుస్ఫూర్తి పెరుగుతాయి

## - మిట్స్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో అన్నమయ్య జిల్లా,మిట్స్ ఎన్ఎస్ఎస్ మరియు అన్నమయ్య జిల్లా మై భారత్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఖేలో ఇండియా - ఖేల్ కీ బాత్ విత్ పీఎం మోదీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో మిట్స్ యూనివర్సిటీకి చెందిన క్రీడా విద్యార్థులు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.వర్చువల్ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు కూడా విద్యార్థులు సమాన ప్రాధాన్యమివ్వాలని సూచించారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయ కత్వ లక్షణాలు,జట్టు స్ఫూర్తి,ఆత్మవిశ్వాసం,పట్టుదల,నిర్ణయ సామర్థ్యం వంటి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.దేశంలోని యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి,వారికి సరైన వేదికలు,శిక్షణ,అవకాశాలు కల్పించేందుకు ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. విద్యార్థులు నిరంతరం సాధన చేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అదేవిధంగ వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు.యువతలో నైపుణ్యాభివృద్ధి,డిజిటల్ పరిజ్ఞానం,ఆర్థిక అవగాహన,సామాజిక బాధ్యత,స్వచ్ఛంద సేవా దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు.మై భారత్ వేదిక ద్వారా యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ,వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడం లక్ష్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో మిట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,వాలీబాల్ సౌత్ జోన్ క్రీడాకారుడు సిద్ధార్థ్,బాస్కెట్‌బాల్ సౌత్ జోన్ క్రీడాకారిణి వైష్ణవి,నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ ప్రతినిధి రాజ్ కుమార్,మై భారత్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు,ఆర్.బాలాజీ,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పూజారి రాజేష్,క్రీడా విద్యార్థులు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




# తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం

## - సర్ స్పెషల్ అబ్జర్వర్,సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు





మదనపల్లె (ప్రజా సీమ) :

తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యమని జిల్లా సర్ స్పెషల్ అబ్జర్వర్,సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న సర్ ప్రక్రియను గురువారం ఆయన మదనపల్లె జీఆర్టీ హైస్కూల్, పప్పిరెడ్డిపల్లి మున్సిపల్ పాఠశాలల్లో ఉన్న 16/164,89/164,93/164 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలను పరిశీలించిన ఆయన,సర్ ప్రక్రియలో గుర్తించిన మరణించిన ఓటర్లు,డూప్లికేట్ ఓటర్లు తదితర వివరాలకు సంబంధించిన ఫారాలను పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాల పరిధికి చెందిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఒకే ఇంటి నంబర్‌కు అధిక సంఖ్యలో ఓటర్లు నమోదై ఉన్నారా,ఫొటోలు లేని ఓటర్ల వివరాలు ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించి, మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు.ఓటర్ల జాబితా పరిశీలనతోపాటు పోలింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లు,ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి ఎలాంటి తప్పులు,పొరపాట్లు లేకుండా జాబితాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు.

### పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

మదనపల్లె త్యాగరాజు వీధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను చక్రధర్ బాబు పరిశీలించారు.ఆరోగ్య కేంద్రం లో రోజువారీ ఓపీ,ఐపీ సేవలు,ల్యాబొరేటరీ పరీక్షలు, రోగుల అడ్మిషన్లు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రజలకు వైద్య సేవలను సమర్థ వంతంగా అందించేందుకు చర్యలు తీసు కోవాల న్నారు. ఈ తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,మున్సిపల్ కమిషనర్ ప్రమీల,డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ శ్రీనివాసులు, డిసిహెచ్ఎస్ లక్ష్మీప్రసాద్,రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడింగ్‌లో అధిక లాభాలు పేరుతో చీటింగ్

## -వ్యక్తిని అరెస్ట్ కడపవన్ టౌన్ పోలీసులు-కడప వన్ టౌన్ ఇన్స్పెక్టర్ తిమ్మారెడ్డి

కడప, ఆగస్టు 27 (ప్రజాసీమ):



ట్రేడింగ్, ఇతర వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపి రూ.50 లక్షలు మోసం చేసిన కేసులో జేస్టాది సుమన్ దీపక్ రాజ్ (43)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కడప వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం, గన్నెవారిపల్లె కాలనీకి చెందిన జేస్టాది సుమన్ దీపక్ రాజ్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మెహిదీపట్నం, కాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన పేరుతో హైదరాబాద్‌లో జేస్టాది సుమన్ గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవర్ ఫస్ట్ ఇంపీరియల్ గ్లోబల్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రెండు కంపెనీలు ఉన్నాయని, తనకు అంతర్జాతీయ ట్రేడింగ్ లైసెన్స్ ఉందని, వాటిలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని, విదేశాల్లో ఆహార ఉత్పత్తుల ఎగుమతి వ్యాపారం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు అందిస్తానని గొడుగు శివకుమార్‌ను నమ్మించినట్లు తెలిపారు. దీంతో శివకుమార్ రూ.50 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయినట్లు తెలిపారు. ఏప్రిల్ 11న ఫిర్యాదు చేయడంతో కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో నిందితుడు ఇదే విధంగా పలువురు ప్రజలను మాయమాటలతో నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడినట్లు, అతనిపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడు సుమన్ దీపక్ రాజ్‌ను ఆగస్టు 27న అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి తెలిపారు. నిందితుడిపై కడప చిన్న చౌక్ కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ,అమీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ,వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు.గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవర్ ఫస్ట్ ఇంపీరియల్ గ్లోబల్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లను ఉపయోగిస్తూ ట్రేడింగ్, ఇతర వ్యాపారాల పేరుతో ప్రజల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు చెప్పారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తుల మాటలను నమ్మి పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెట్టకుండా కంపెనీలు, వ్యాపార కార్యకలాపాలు, అనుమతులు తదితర వివరాలను పూర్తిగా పరిశీలించాలని, నిందితుడి మాయమాటలను నమ్మవద్దని ఇన్స్పెక్టర్ తిమ్మారెడ్డి తెలిపారు.

# కళ్లకు వెలుగు.. జీవితాలకు కొత్త భరోసా.. వీపీఆర్ నేత్ర

## జిల్లా వ్యాప్తంగా 1,10,317 మందికి కంటి పరీక్షలు..

## 64,760 మందికి ఉచిత కళ్లద్దాలు

బుచ్చిరెడ్డి పాళెం , ఆగస్టు 27(ప్రజా సీమ) :



కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేద, సామాన్య ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్న వీపీఆర్ నేత్ర కార్యక్రమం కోవూరు నియోజకవర్గంలో మరింత విస్తరిస్తోంది. ఇప్పటికే కొడవలూరు, విడవలూరు, కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో సేవలు పూర్తికాగా, గురువారం ఐదో మండలమైన బుచ్చిరెడ్డిపాళెంలో సేవలు ప్రారంభమయ్యాయి. బుచ్చిరెడ్డిపాళెం అర్బన్, శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల ద్వారా వారికి అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

### ఓ పెద్దాయన కంటి సమస్యతో పుట్టిన ఆలోచన

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉదయగిరికి వెళ్లిన సమయంలో ఒక పెద్దాయన తన వైపు చూడకుండా మరో వైపు చూస్తూ మాట్లాడటం గమనించానని తెలిపారు. కంటి చూపు సరిగా లేదని, తనను ఆత్మకూరుకు తీసుకెళ్లేందుకు కూడా ఎవరూ లేరని ఆ పెద్దాయన చెప్పడంతో తనలో ఒక ఆలోచన మొదలైందన్నారు. అదే తర్వాత వీపీఆర్ నేత్ర కార్యక్రమంగా రూపుదిద్దుకుందని చెప్పారు.మొదట వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రయల్ రన్‌గా బస్సును ఏర్పాటు చేశామని, ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో 2025 నవంబర్ 3న ఉదయగిరిలో వీపీఆర్ నేత్ర సేవలను ప్రారంభించామని తెలిపారు. ఒక బస్సుతో అన్ని నియోజకవర్గాలకు సేవలు అందించ డానికి ఎక్కువ సమయం పడుతుందని భావించి రెండో బస్సును కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.ఇప్పటివరకు 1,10,317 మందికి కంటి పరీక్షలు నిర్వహించగలిగామని, ఇది సాధారణ విషయం కాదని అన్నారు. సిబ్బంది అర్ధరాత్రి వరకు ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు లేకుండా పనిచేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు వీపీఆర్ నేత్ర సేవలపై వారు సానుకూలంగా మాట్లాడటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు.

### కోవూరులో 36,134 మందికి కంటి పరీక్షలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో వీపీఆర్ నేత్ర అత్యంత గొప్ప ప్రాజెక్టు అని అన్నారు. వీపీఆర్ విద్య, వీపీఆర్ వైద్యం, వీపీఆర్ అమృతధార, వీపీఆర్ వికాస్ వంటి కార్యక్రమాలతో పాటు వీపీఆర్ నేత్ర ద్వారా వేలాది మందికి కంటి చూపును మెరుగుపరిచే సేవలు అందుతున్నాయని తెలిపారు.కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 36,134 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 24,817 మందికి ఉచిత కళ్లద్దాలు అందించామని చెప్పారు. ఇది దాదాపు 69 శాతం మందికి కంటి చూపు మెరుగుపడేలా సేవలు అందించినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,10,317 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 64,760 మందికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. మరో బస్సు ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలోనూ వీపీఆర్ నేత్ర సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు.పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వీపీఆర్ నేత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంతి రెడ్డి కోరారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న కోఆర్డినేటర్ శంకర్, డాక్టర్ కృష్ణప్రసాద్, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### పొంగూరులోనూ వీపీఆర్ నేత్ర సేవలు

అంతకుముందు గురువారం సాయంత్రం ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలం పొంగూరులో ప్రారంభమైన వీపీఆర్ నేత్ర కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ ద్వారా వారికి అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవాలంటే ముందస్తు సమాచారం లేకుండా రావడం మంచిదని ఎంపీ అన్నారు. అప్పుడే వాస్తవ పరిస్థితులను తెలుసుకోవచ్చని, ప్రజల నుంచి నేరుగా సేవలపై అభిప్రాయాలు వింటే ఎంతో తృప్తిగా ఉంటుందని తెలిపారు.

# ఉప్పాడలో వరుస దొంగతనాల.. పాత నేరస్థుడు అరెస్ట్

## రూ.7 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

పిఠాపురం (ప్రజా సీమ )



ఉప్పాడ, కొత్తపల్లి ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని కొత్తపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.7,000 నగదు, వివిధ కంపెనీలకు చెందిన మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15వ తేదీ రాత్రి ఉప్పాడ సెంటర్‌లోని ఓ వైన్స్ దుకాణం పైకప్పు సిమెంట్ రేకులు తొలగించి లోపలికి ప్రవేశించిన దుండగుడు సుమారు రూ.2,000 నగదు, రెండు పాత ట్యాబ్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను అపహరించాడు. అదే రాత్రి సమీపంలోని బార్బర్ షాప్, ఉప్పాడ డైలీ మార్కెట్‌లోని కిరాణా దుకాణం, అమీన్‌షాబ్ సెంటర్‌లోని చికెన్ షాప్, హార్డ్‌వేర్ షాపుల పైకప్పు రేకులు తొలగించి నగదు దొంగతనాలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుల మేరకు యూ.కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కాకినాడ సబ్‌డివిజన్ డీఎస్పీ పర్యవేక్షణలో, పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచనలతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఉప్పాడ శ్రీ శ్రీనివాస సినిమా హాల్ వెనుక నిర్మాణంలో ఉన్న ఖాళీ భవనం వద్ద రాత్రి 11:30 గంటల ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామం వాడబలిజ ప్రాంతానికి చెందిన గంగిరి అశోక్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో అశోక్ పాత నేరస్థుడని, అతనిపై గతంలో వివిధ జిల్లాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 13 దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడైంది. చీరాల రూరల్, కొవ్వూరు టౌన్, రాజమండ్రి టౌన్, కొత్తపల్లి, తిరుచానూరు, ధవళేశ్వరం, తణుకు, వేదుల్లపల్లి తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పిఠాపురం న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండలం ఎస్సై వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రావణ శుక్రవారం.. వాసవి అమ్మవారి ప్రత్యేక పూజలు

పొదలకూరు: ఆగస్టు 27 (ప్రజా సీమ) :

పట్టణంలోని రామమందిరం వీధిలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.శుక్రవారం ఉదయం 6.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారికి పల్లకి సేవ, అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందని తెలిపారు.శ్రావణమాసం సందర్భంగా మహిళా భక్తుల కోసం రాత్రి 7 గంటలకు లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పల్లకి సేవ అనంతరం లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచే ముగ్గురు మహిళా భక్తులకు అమ్మవారి పూజలో ఉంచిన చీరలను బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆకులూరు మధుసూదన్, శ్రీమతి నీరజ ఉభయకర్తలుగా వ్యవహరించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థాన కమిటీ కోరింది.

ప్రజాసీమ

## సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది
## ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## అల్లుఅర్జున్‌కు అరుదైన గౌరవం



ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

### భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది.'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.



## రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజనీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.




## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

### రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.



## నుటడు నారాయణరావు కన్నుమూత

ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బిన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.




## 4న వస్తున్న సహా

శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రధారులుగా నిశాంత్ దోటి తెరకెక్కించిన చిత్రం 'సహా (లైఫ్ ఆఫ్ సంజు)' తేజేశ్వర్ వేల్పుచర్ల నిర్మాత. వ్రజన పాండ్య, మహిపాల్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేసింది. 'సంజు అనే వ్యక్తి జీవితంలోని వివిధ దశల్ని చూపించే సినిమా ఇది. తన ప్రేమ, బ్రేకప్, మధుర జ్ఞాపకాలు, ఎదుర్కొన్న సవాళ్లు అన్నింటినీ దీంట్లో చూపించనున్నారు. ఇది ప్రతిఒక్కరి మనసుకు దగ్గరయ్యే ఓ భావోద్వేగభరిత ప్రయాణంలా ఉంటుంద'ని చిత్ర వర్గాలు తెలిపాయి.




Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma